
- రెండో రోజూ కొనసాగిన సోదాలు
- కీలక ఫైళ్లు, కంప్యూటర్ హార్డ్ డిస్కుల పరిశీలన
- మంగళవారం రోజంతా విచారణ
- బుధవారం కూడా కంటిన్యూ
- నిజనిజాల నిగ్గు తేల్చే పనిలో రేవంత్ సర్కారు



మేడిగడ్డ బ్యారేజీ

అవినీతిపై ఆరా!

కాళేశ్వరం ప్రాజెక్టుపై విజి'లెన్స్'

భూపాలపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి చోటుచేసుకుందని కాంగ్రెస్ మొదటి నుంచే ఆరోపిస్తోంది. అధికారంలోకి రాగానే దీనిపై ఫోకస్ పెట్టింది. అవినీతిని వెలికి తీసేందుకు వేగంగా అడుగులు ముందుకేసింది. కాళేశ్వరం ఇంజనీర్లు, నీటిపారుదల శాఖ అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించింది. ఈ క్రమంలోనే గత నెల 29న ఐదుగురు మంత్రుల బృందం మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శించింది. అక్కడే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించింది. ఈ క్రమంలోనే దీంతో పాటు జ్యుడిషియల్ విచారణ కూడా చేపడతామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే రెండు రోజులుగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన కార్యాలయాలపై దాడులు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. కీలక పత్రాలను కొంతమంది అధికారులు మాయం చేస్తున్నారనే సమాచారం మేరకు ఈ బృందం తనిఖీలు చేపడుతున్నట్టు తెలుస్తోంది. కాళేశ్వరం అవినీతిపై ప్రభుత్వం వేగంగా దర్యాప్తు చేపడుతుండటంతో ఏం జరగనుందో అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

ఎన్నికల సమయంలో నవంబరు 2న ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ మేడిగడ్డ బ్యారేజీని సందర్శించారు. అక్టోబరు 21న కుంగిపోయిన బ్యారేజీని పరిశీలించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాళేశ్వరం బ్యారేజీ ఏటీఎంగా మారిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే కాళేశ్వరంపై విచారణ జరిపిస్తామని ప్రకటించారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టింది. కొత్త సర్కారు కొలువుదీరగానే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గం కాళేశ్వరం ప్రాజెక్టుపై దృష్టిపెట్టింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోడంపై ముఖ్యమంత్రి సీరియస్‌గా తీసుకున్నారు. ఈ వైఫల్యం వెనుక కేసీఆర్ ప్రభుత్వంలో బాధ్యులెవరనే అంశంపై ప్రధానంగా ప్రభుత్వం దృష్టిపెట్టింది. దీంతో డిసెంబరు 11న భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లోని జలసౌధాలో నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు రిపోర్టు మొత్తం తమకు సమర్పించాలని ఆదేశించారు. ఆ తర్వాత 16న శాసన మండలిలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మేడిగడ్డపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో 17న నీటిపారుదల శాఖ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమై కాళేశ్వరం ప్రాజెక్టుపై సమీక్షించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం, నాణ్యత, మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి కారణాలపై ఆరా తీశారు. ప్రభుత్వానికి పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. 18న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాళేశ్వరం చీఫ్ ఇంజనీర్లు మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, బి.నాగేంద్రతోపాటు ఎల్అండ్‌టీ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ దేశాయ్ తదితరులతో మేడిగడ్డపై సమీక్ష నిర్వహించారు. కుంగిన బ్యారేజీని ఎల్అండ్‌టీ కంపెనీ పునరుద్ధరించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒత్తిడి తెచ్చారు. ఆ తరువాత 29వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల బృందం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి కుంగిన ప్రాంతాన్ని పరిశీలించింది. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగస్వామ్యమైన ఈఎన్‌సీలు మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లుతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇప్పించారు. మేడిగడ్డ బ్యారేజీని రూ.4,600 కోట్ల వ్యయంతో నిర్మించామని, 20వ పిల్లర్ 1.2 మీటర్ల మేరకు కుంగిందని తేలిందని, దీంతో పాటు మిగతా పిల్లర్ల పరిస్థితిపై విచారణ చేపడతామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి శాసన మండలిలో ప్రకటించినట్టుగానే కాళేశ్వరం జ్యుడిషియల్ విచారణ చేపడతామని ప్రకటించారు. ఈ క్రమంలోనే నెల రోజులుగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం పకడ్బందీగా వ్యవహరిస్తోంది. ప్రాజెక్టులో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.



మహదేవపూర్‌లోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో రికార్డులను పరిశీలించేందుకు వెళ్తున్న విజిలెన్స్ బృందం

ముమ్మరంగా విజిలెన్స్ సోదాలు

కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి చోటుచేసుకుందనే ఆరోపణల నేపథ్యంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం విచారణ చేపడుతోంది. హైదరాబాద్‌లోని జలసౌధాతో పాటు రామగుడం ఈఎన్‌సీ కార్యాలయం, కరీంనగర్ ఎల్ఎండీ, భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లోని నీటిపారుదల శాఖ కార్యాలయం, మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంపుహౌస్ సహా మొత్తం 10 చోట్ల ఏకకాలంలో మంగళవారం దాడులు నిర్వహించింది. ప్రధానంగా భూపాలపల్లి జిల్లాలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ రమేష్ నేతృత్వంలో 12 మంది అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. మంగళవారం మహదేవపూర్ నీటిపారుదల శాఖ కార్యాలయంలో మేడిగడ్డ బ్యారేజీ, గ్రావిటీ కెనాల్, కన్నెపల్లి పంపుహౌస్‌కు సంబంధించిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకొని భద్రపర్చారు. బుధవారం ఉదయం నుంచే మళ్లీ గ్రావిటీ కెనాల్‌తో పాటు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల నిర్మాణం, కాంట్రాక్టు ఒప్పందం, డీపీఆర్, సబ్ కాంట్రాక్టు పనులు తదితర అంశాలకు సంబంధించిన కీలక పత్రాలను

మిగతా 6వ పేజీలో...

ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పట్టం కట్టాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జనవరి 10: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు కాంగ్రెస్ అభ్యర్థికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పులా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు రెట్టింపు ఉత్సాహంతో గెలిపించాలని అన్నారు. భూపాలపల్లిలో బుధవారం నిర్వహించిన పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన కార్యక్రమానికి కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి తీన్మార్ మల్లన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం గత డిసెంబర్ 28 నుంచి ప్రారంభమైందని తెలిపారు. ఇది ఫిబ్రవరి 6 వరకు కొనసాగుతుందన్నారు. ఓటరు నమోదు సమగ్రంగా నిర్వహించేందుకు కోఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను గెలిపించుకోవాలన్నారు.

బీఆర్ఎస్‌ను ఎవరూ పట్టించుకోరు : తీన్మార్ మల్లన్న

బీఆర్ఎస్‌ను ఇప్పుడు ప్రజలెవరూ పట్టించుకొనే పరిస్థితిలో లేరని తీన్మార్ మల్లన్న వ్యాఖ్యానించారు. అయినా కొంతమంది ఆ పార్టీ నాయకులు కాంగ్రెస్‌పై అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతి పేరుకుపోయిందనే విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. అందుకే ఆ పార్టీని ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అత్యధిక సంఖ్యలో పట్టభద్రులు ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, నాయకులు గండ్ర సత్యనారాయణరెడ్డి, చాడా రఘునాథ్‌రెడ్డి, పిప్పాల రాజేందర్, అంబాల శ్రీనివాస్, దాట్ల శ్రీనివాస్, దేవన్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మహాజాతరకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ ఇలా త్రిపాఠి ● మేడారంలో పర్యటన



మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మేడారం, జనవరి 10 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం మహాజాతరలో భక్తులకు పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మేడారంలో పలు శాఖ అధికారులతో కలిసి ఆమె బుధవారం పర్యటించారు. మహాజాతర కోసం చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. హరిత హోటల్, పగిడిద్దరాజు, గోవిందరాజు భవనాలు, వీడియా పాయింట్, వాచ్ టవర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హరిత హోటల్ పునరుద్ధరణ పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల చివరకల్లా హోటల్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు సమ్మక్క, సారలమ్మల మహా జాతర జరగనుందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. భక్తులకు పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డీపీవో వెంకయ్యను ఆదేశించారు. జాతర నిర్వహణ పనుల్లో వేగం పెంచి త్వరగతిన పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శ్రీజ, ఇంజనీరింగ్ అధికారి అజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పశు వైద్య బృందం పర్యటన

మేడారంలో పశు వైద్య బృందం పర్యటించింది. మహాజాతర సమయం దగ్గర పడుతున్న క్రమంలో అక్కడ ఏర్పాటు చేసిన కోళ్ల దుకాణాలను సందర్శించారు. షాపుల్లో కోళ్లు రోగాల బారిన పడి మృతి చెందుతున్నాయని, పలువురు వ్యాధి సోకిన కోళ్లను అమ్ముతున్నారని వస్తున్న వార్తల నేపథ్యంలో పర్యటించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పశు సంవర్ధక జిల్లా వైద్యాధికారి విజయభాస్కర్ నేతృత్వంలో ఆ శాఖ అధికారులు కోళ్ల దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి విజయభాస్కర్ మాట్లాడుతూ హోల్‌సేల్ వ్యాపారులు వైద్యుల సలహాలు, పర్యవేక్షణ లేకుండా కోళ్లను సరఫరా చేయడం వల్ల ఇలాంటి సమస్యలు తలెత్తున్నాయని తెలిపారు. మేడారంలో టన్ను కొద్దీ మాంసం విక్రయాలు జరుగుతున్నాయని, నాణ్యత విషయంల ఎవరికైనా అనుమానం వస్తే వెంటనే పశుసంవర్ధక శాఖ వైద్యాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట డాక్టర్ నర్సింహ, గోపాలమిత్ర సభ్యుడు బాలరాజు తదితరులు ఉన్నారు.



దుకాణాల వద్ద కోళ్లను పరీక్షిస్తున్న పశు వైద్యాధికారులు

కరెంటు ఉచ్చుకు రైతు బలి



విద్యుత్ షాక్‌తో మరణించిన సాంబయ్య

ములుగు, జనవరి 10: అటవీ జంతువులను వేటాడేందుకు అమర్చిన విద్యుత్ ఉచ్చుకు ఓ రైతు బలయ్యాడు. ములుగు మండలం పెగడపల్లిలో మంగళవారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెగడపల్లికి చెందిన మినుగు సాంబయ్య(45) ఎకరన్నర భూమిని కౌలుకు తీసుకొని మిర్చి పంటను సాగు చేసున్నాడు. చేనుకు నీళ్ల పారించేందుకు తన భార్య మణెమ్మతో కలిసి రాత్రి 10.30 గంటల సమయంలో వెళ్లాడు. మోటార్ ఆన్ కాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎవరైనా సరఫరా నిలివేశారేమోనని భావించాడు. సమీపంలోనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్తున్న క్రమంలో కాలికి కరెంటు వైరు తగిలి కుప్పకూలిపోయాడు. వెనుకనే వస్తున్న మణెమ్మ ప్రమాదాన్ని గమనించి భయంతో గ్రామంలోకి వెళ్లి విషయాన్ని తెలిపింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న సాంబయ్యను ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో బుధవారం అతడు కన్నుమూశాడు. పెగడపల్లికి చెందిన లక్ష్మీనర్సు, ఈసం ముత్తారావు, ఈసం అశోక్, ఆలూరి ప్రశాంత్, ఆగబోయిన లక్ష్మయ్య అటవీ జంతువులను హతమార్చేందుకు బైండింగ్ వైరుతో ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇచ్చి ఉచ్చు అమర్చగా గమనించని సాంబయ్య ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

'చార్మినార్' క్షతగాత్రుల్లో మానుకోట వాసులు

ముగ్గురికి గాయాలు

లాలాగూడ ఆస్పత్రికి తరలించిన రైల్వే అధికారులు

నెహ్రూసెంటర్ (మహబూబాబాద్ జిల్లా), జనవరి 10 : హైదరాబాద్‌లోని నాంపల్లి స్టేషన్‌లో బుధవారం చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పిన ప్రమాదంలో మహబూబాబాద్ వాసులు ముగ్గురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యాకూబ్ పాషా, బీఆర్ఎస్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం అలీ హైదరాబాద్‌కు బయల్దేరారు. సంక్రాంతి పండుగకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో అక్కడ చదువుతున్న తమ పిల్లలను తీసుకొచ్చేందుకు వెళ్లారు. అలాగే జనగామ జిల్లా రఘునాథపల్లి మండలానికి చెందిన టి.లక్ష్మి, శ్రీనివాస్ దంపతులు కొంతకాలంగా బతుకుదెరువు కోసం మహబూబాబాద్‌లో నివాసముంటుండగా వీరి పిల్లలు కూడా హైదరాబాద్‌లో చదువుతున్నారు. వారిని తీసుకొచ్చిందుకు లక్ష్మీ, శ్రీనివాస్ రైలు ఎక్కారు. మరికొద్ది క్షణాల్లో స్టేషన్‌లో దిగుతామని అనుకున్నలోపే నాంపల్లి స్టేషన్‌లో రైలు పట్టాలు తప్పి సైడ్‌వాల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో యాకూబ్‌పాషా కాలు విరిగింది. ఇబ్రహీం అలీకి చేయి విరిగింది. లక్ష్మి చేతికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ముగ్గురిని దక్షిణ మధ్య రైల్వే అధికారులు లాలాగూడ రైల్వే ఆస్పత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం తక్షణ సాయంగా ఇబ్రహీం అలీకి, యాకూబ్‌పాషాకు రూ.50 వేల చొప్పున నగదును అందించారు.





రైలు ప్రమాదంలో గాయపడిన ఇబ్రహీం అలీ, లక్ష్మి

టెన్త్ ప్రత్యేక తరగతులను పకడ్బందీగా నిర్వహించాలి

ప్రధానోపాధ్యాయులతో డీఈవో పాణిని



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో పాణిని

ములుగు కలెక్టరేట్, జనవరి 10: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పదో తరగతి ప్రత్యేక తరగతులతోపాటు తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి. పాణిని అన్నారు. జిల్లాకేంద్రంలో ఆయన ప్రధానోపాధ్యాయులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. లక్ష్య అమలులో భాగంగా పదోతరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అదనంగా ఒక గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేస్తూ రాష్ట్రంలో వార్షిక పరీక్షల ఫలితాల్లో ములుగు జిల్లాను మొదటిస్థానంలో నిలిపేలా కృషి చేయాలన్నారు. ప్రత్యేక తరగతుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లయితే శాఖాపరమైన చర్యలు ఉంటాయని అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటిస్తూ నిబద్ధతతో పనిచేయాలని, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, మండల నోడల్ అధికారులు వారి పరిధిలోని పాఠశాలలను సందర్శించి తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను విజయవంతం చేయడంలో శక్తివంచన లేకుండా కృషి చేయాలని అన్నారు. ఈసమావేశంలో సమగ్రశిక్ష కోఆర్డినేటర్లు బద్దం సుదర్శన్‌రెడ్డి, అర్షం రాజు, రమాదేవి, సాంబయ్య, డీసీఈబీ కార్యదర్శి విజయమ్మ, జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్, మండల విద్యాశాఖ అధికారులు సామల శ్రీనివాసులు, సురేందర్, దివాకర్, రాజేష్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ బోధన

పట్టణ ప్రాంతాల్లోని కార్పొరేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు దీటుగా గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం, వారి పాఠ్యాంశాలకు సంబంధించిన లోతైన సమాచారం అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని అన్నారు. పాఠశాల విద్యాశాఖ ఎంపిక చేసిన పాఠశాలల పిల్లల సంఖ్యకనుగుణంగా కంప్యూటర్లను అందజేసినట్లు తెలిపారు.

పదోతరగతి తర్వాత ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్ కోర్సుల్లో విద్యాభ్యాసానికి సంబంధించి కంప్యూటర్ వినియోగం తప్పనిసరి అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలని ప్రభుత్వం సంకల్పించిందని, ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా 17 పాఠశాలలను గుర్తించి వాటికి కంప్యూటర్లు, ప్రింటర్లను అందజేసినట్లు పేర్కొన్నారు.

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	సినీ ప్లానెట్ - కొంపల్లి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ రాధిక - కాప్రా
ఆర్.కె. - బంజారాహిల్స్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
గలేరియా - పంజాగుట్ట	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ సినిమాస్ - చందానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	లక్ష్మీనరసింహ - మియాపూర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
ఆట్రియమ్ - గచ్చిబౌలి	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎస్2 సోమ - మల్లాపూర్	మూవీటైమ్ - అమీర్‌పేట
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
ఎం.పి మాల్ - కాచిగూడ	టివోలి - సికింద్రాబాద్
జిఎస్ఎమ్ - మదీనగూడ	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
నెక్లెస్ సత్వ - కవాడిగూడ	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	షా షహెన్‌షా - చింతల్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	మూవీమ్యాక్స్ - మౌలాలి
మంత్రామాల్- అత్తాపూర్	జె.పి.సినిమాస్ - చందానగర్
సుధా - శాలిబండ	మరియు
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్	మీ అభిమాన థియేటర్లలో

కేయూ పరీక్ష కేంద్రాలను సందర్శించిన వీసీ రమేశ్

కేయూ క్యాంపస్, జనవరి 10: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో కేయూ క్యాంపస్‌లోని బయో టెక్నాలజీ విభాగంలో నిర్వహిస్తున్న పీజీ మూడో సెమిస్టర్ పరీక్ష కేంద్రాలను బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ పరిశీలించారు. విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, నగరంలోని గీతాంజలి, మాస్టర్‌జీ, సిటీ మహిళా కళాశాల పరీక్ష కేంద్రాలను కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ పోడేటి శ్రీనివాస్, డాక్టర్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్

కేయూ క్యాంపస్, జనవరి 10: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ రెండో ఏడాది మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 18 నుంచి జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అధనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు బుధవారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. రెగ్యూలర్, ఎక్స్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

బీపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు..

కేయూ పరిధిలో బీపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు జనవరి 18, 20, 22, 24 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం వరకు జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు బుధవారం తెలిపారు. రెగ్యూలర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్ అభ్యర్థులందరూ హాజరుకావాలన్నారు.

కేసముద్రంలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌ను పరిశీలిస్తాం

▸▸ రైల్వే పీసీసీఎం రవీన్‌కుమార్ రెడ్డి


కేసముద్రం రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న రైల్వే పీసీసీఎం రవీన్‌కుమార్‌రెడ్డి

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), జనవరి 10 : కేసముద్రం రైల్వేస్టేషన్‌లో మణుగూర్, ఇంటర్‌సిటీ, కరీంనగర్ ఎక్స్‌ప్రెస్‌ల హాల్టింగ్‌ను పరిశీలించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్(పీసీసీఎం) కె.రవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన వ్యాపారులు, ఉద్యోగులు, ప్రయాణికులు ఆయనకు రైళ్ల హాల్టింగ్‌పై విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందిస్తూ పరిశీలిస్తామని, త్వరలో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటే మూడో లైను నిర్మాణంతోపాటే ప్లాట్‌ఫాలపై ఫుల్‌కవర్‌షెడ్లు, డిస్‌ప్లే బోర్డులు, రెండో ప్లాట్‌పై ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మిషన్(ఏటీవీఎం)ను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. వరంగల్‌కు అప్‌అండ్‌డౌన్ చేసే వారు మహబూబాబాద్ నుంచి కాకుండా కేసముద్రం నుంచి సీజన్ టికెట్లు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ పీసీసీఎం భాస్కర్, సీనియర్ డీసీఎం బస్వరాజ్, స్థానికులు వోలం శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, తొను పునూరి భాస్కర్, బచ్చు లక్ష్మీనారాయణ, బోనగిరి ఉపెందర్ ఉన్నారు.

మేడారంలో ముందస్తు మొక్కులు


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 10 : తాడ్వాయి మండలం మేడారం వనదేవతల సన్నిధిలో సందడి నెలకొంది. మహాజాతరకు ముందుగానే భక్తులు భారీ సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. బుధవారం సుమారు 30 వేల మంది తల్లుల దర్శనాలు చేసుకున్నారు. తెలంగాణలోని నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. ముందుగా ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకొని అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకొని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె సారె, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం) సమర్పించారు. చల్లగా చూడాలని వేడుకున్నారు.


ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు


సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు


ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్


ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని


ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి


ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సినీనటి అనన్య


ముగ్గులు వేస్తున్న మహిళలు



అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ

ఐనవోలు జాతరలో వాకిటాకీ సేవలు

ఐనవోలు, జనవరి 10: ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరలో దేవస్థానం అధికారులు వాకిటాకీ సేవలు అందుబాటులోకి తెచ్చారు. గతంలో పోలీస్ అధికారులు, సిబ్బంది మాత్రమే వాకిటాకీల ద్వారా బందోబస్తు విధులు నిర్వర్తించేవారు. గత జాతర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ సారి ఆ సమస్యలు పునరావృతం కాకుండా ఉండేందుకు క్యూలైన్లు, తాగునీరు, పారిశుధ్యం పరిశీలన, బోనం, పట్నాల టిక్కెట్ల విక్రయాలు, లడ్డుప్రసాదం అమ్మకాల వద్ద భక్తుల రద్దీ తదితర అంశాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేవిధంగా ఆయా విభాగాలు చూసే

నేడు ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల బంద్

వడ్డెపల్లి, జనవరి 10 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నల్లచట్టానికి నిరసనగా గురువారం వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఓరుగల్లు ప్రైవేటు విద్యాసంస్థల బస్సు డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దొడ్డిపాటి సారయ్య, ప్రధాన కార్యదర్శి బండి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023 చట్టంలో భాగంగా డ్రైవర్లపై మోపిన చట్టం వలన డ్రైవర్లకు 10 సంవత్సరాలు జైలు శిక్షా, రూ. 7 లక్షల జరిమానాను వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బస్సు డ్రైవర్స్, క్లీనర్స్ ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు కేయూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

కేయూ క్యాంపస్, జనవరి 10: ఈనెల 12 నుంచి 16 వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే 27వ నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు కేయూ జాతీయ సేవ పథకం(ఎన్‌ఎస్‌ఎస్) విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిని బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణలు ప్రత్యేకంగా అభినందించారు. నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు ఎంపికైన వారిలో కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల నుంచి సీహెచ్. అక్షయశ్రీ, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి ఎ.ఇప్రితా, కోఎడ్యుకేషన్ మహిళ ఇంజరింగ్ కళాశాల నుంచి ఎల్.అనిల్ కుమార్, వర్సిటీ ఫార్మసీ కళాశాల నుంచి పి.సందీప్‌లు ఉన్నారని ప్రొఫెసర్ ఈసం నారాయణ తెలిపారు.

నూతన హైకోర్టుకు అగ్రికల్చర్ వర్సిటీ భూములు ఇవ్వొద్దు

కేయూ క్యాంపస్, జనవరి 10: హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర నూతన హైకోర్టుకు అగ్రికల్చర్ వర్సిటీకి చెందిన భూములను కేటాయించడాన్ని విరమించుకోవాలని కేయూ ఏబీవీపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కేయూలో జరిగిన ఏబీవీపీ సమావేశంలో కేయూ ఏబీవీపీ అధ్యక్షుడు కె.ప్రశాంత్ మాట్లాడారు. వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 55ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మూగ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు

- రూ. 5 లక్షల 50 వేల జరిమానా

వరంగల్ లీగల్, జనవరి 10 : మూగ, మానసిక వికలాంగురాలైన బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5 లక్షల 50వేల జరిమానా విధిస్తూ జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వై.సత్యేంద్ర బుధవారం తీర్పు వెలువరించారు. అదే విధంగా బాధుతురాలికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ నుంచి రూ. 5 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలం మంగమ్మతోట మార్కండేయ నగర్‌కు చెందిన 14 సంవత్సరాల బాలిక పుట్టుకతోనే మూగ, మానసిక వికలాంగురాలు. ఎప్పటిలాగే బాధితురాలిని ఇంటి వద్ద ఉంచి 2019 నవంబరు 7న పనికి వెళ్లిన తల్లిదండ్రులు తిరిగి సాయంత్రం 5 గంటలకు తిరిగి వచ్చారు. అప్పటికే ఏడుస్తున్న కూతురుని అడుగగా తనకు కడుపునొప్పిగా ఉందని వారికి సైగలతో చెప్పడంతో ఏమి జరిగిందని అడుగగా 6వ తేదీన మధ్యాహ్నం 3.15 గంటలకు ఒంటరిగా ఉన్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన తేజావత్ హచ్చు అలియాస్ రమేశ్ ఇంటిలోకి వచ్చి అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపింది. గతంలో కూడా రెండు సార్లు అత్యాచారానికి పాల్పడినట్లు సైగల ద్వారా తల్లిదండ్రులకు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడి తేజావత్ రమేశ్‌కు 20 ఏళ్ల జైలుశిక్ష, రూ. 5 లక్షల 50 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

ఎమ్మెల్సీ ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేష్‌మిశ్రా


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 10: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ పట్టభద్రుల ఓటరు నమోదుపై కలెక్టరేట్‌లో తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో కలెక్టర్ బుధ వారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలన్నారు. పట్టభద్రులంతా ఫిబ్రవరి 6లోగా ఫారం 18 ద్వారా ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా గానీ, రెవెన్యూ కార్యాలయాల్లో గానీ దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక అధికారులను నియమించాలన్నారు. 2020 నవంబర్ 1 నాటికి డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారంతా ఓటరు నమోదు చేసుకునేందుకు అర్హులన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి, మాస్టర్ ట్రైనర్లు అవినాష్, సంజీవరావు, వెంకటేశ్వర్లు, ఏడు మండలాల తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రికి ఎంఆర్ఐ సెంటర్

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జనవరి 10: జిల్లా కేంద్రంలోని వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రికి ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్‌ను మంజూరు చేయించినట్టు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. పట్టణంలోని కేకేఎంఎస్ ప్రసాద్ ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యం పెట్టుకున్నామన్నారు. ఇందులో భాగంగానే రూ.5 లక్షల వరకు మాత్రమే పరిమితి ఉన్న ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ. 10లక్షలతో అమల్లోకి తెచ్చామన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం ఆరోగ్యశ్రీ సేవలు అందేలా ముఖ్యమంత్రి పటిష్ట చర్యలు చేపడుతున్నారని తెలిపారు. భూపాలపల్లిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎంఆర్ఐ స్కానింగ్ లేదని, ఇక్కడ ఏం జరిగినా హనుమకొండకు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఇక్కడి వంద పడకల ఆస్పత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్‌ను మంజూరు చేయించానని తెలిపారు. దీంతో ఈ ప్రాంత పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేకేఎంఎస్ ప్రసాద్ ఆసుపత్రి నిర్వాహకులు కుసుమ శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి అధికారులతో సమీక్ష

కాకతీయఖని: భూపాలపల్లి ఏరియా సింగరేణి అధికారులతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం సమావేశమయ్యారు. సంస్థకు సంబంధించిన సీఎస్సార్ పనులు, కాంట్రాక్ట్ పనులు, ఎస్టేట్ విభాగం, సంక్షేమ కార్యాక్రమాలపై సమీక్షించారు. స్థానిక జీఎం కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు, అధికారులు రవికుమార్, రాజగోపాల్, తుకారాం, సాగర్ తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ఇతర రాష్ట్రాల మద్యం సీజ్

మహదేవపూర్, జనవరి 10: మండలంలోని కుదురు పల్లిలోని ఓ బెల్టుషాపులో ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని విక్రయిస్తుండగా ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. బెల్టుషాపులో ఉన్న మధ్యప్రదేశ్‌కు చెందిన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై కాటారం ఎక్సైజ్ సీఐ ప్రశాంతిని వివరణ కోరగా రూ. 5 వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని విచారణ జరపుతున్నామని తెలిపారు.

సమాచార హక్కు చట్టం రక్షణవేదిక క్యాలెండర్ ఆవిష్కరణ

కాటారం, జనవరి 10: సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక క్యాలెండర్‌ను తహసీల్దార్ నాగరాజు బుధవారం ఆవిష్కరించారు. సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రక్షణ వేదిక మల్హర్ మండల అధ్యక్షుడు కుమార్ యాదవ్, నాయకులు రాజయ్య, లక్ష్మణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ


జడల్‌పేటలో అయోధ్య రాముడి అక్షింతలతో గ్రామస్థులు

చిట్యాల, జనవరి 10: అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. జడల్‌పేట, శాంతినగర్, చిట్యాల, దూత్‌పల్లి, ఒడితల గ్రామాల్లో డప్పు చప్పుళ్లు, డీజే పాటలు, మేళతాళాలతో ఊరేగింపు చేపట్టి ఇంటింటికీ అక్షింతలను అందజేశారు. ఆయా గ్రామాల్లోని మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

లారీ డ్రైవర్లు, క్లీనర్ల నిరసన


గణపురంలో నిరసన తెలుపుతున్న లారీ డ్రైవర్లు, క్లీనర్లు

గణపురం, జనవరి 10: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని లారీ డ్రైవర్లు, క్లీనర్లు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం నిరసనకు దిగారు. లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బస్వరాజుపల్లి 8 ఇన్‌క్లైన్ సమీపంలో ఉన్న అసోసియేషన్ కార్యాలయం వద్ద లారీల బంద్ పాటించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ దేవ హరీశ్ మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన భారతీయ న్యాయ సహిత 106-2 హిట్ అండ్ రన్ చట్టం ద్వారా లారీ డ్రైవర్లకు తీరని నష్టం జరుగుతుందన్నారు. ఈ చీకటి చట్టాలను రద్దు చేసే వరకు ఆందోళలను కొనసాగిస్తామన్నారు. వెంటనే కేంద్రం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కుమారస్వామి, సురేందర్, రాజు, దాసరి వేణు తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లిలో..

కాకతీయఖని : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ లారీ డ్రైవర్లు, క్లీనర్లు నిరసనకు దిగారు. భూపాలపల్లి కాకతీయ లారీ డ్రైవర్స్ అసోసియేషన్ కార్యాలయం నుంచి ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లారీ డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే డ్రైవర్ల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతుంటే కొత్త చట్టం తీసుకొచ్చి మరింత భారం వేస్తోందని విమర్శించారు. వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లారీ డ్రైవర్ల అసోసియేషన్ నాయకులు స్వామి, విశ్వనాథ్, పూర్ణచందర్, బాల్‌చంద్ నాయక్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సెంట్రల్ స్కిల్ డెవలప్మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ హినా ఉస్మాన్


మాట్లాడుతున్న హినా ఉస్మాన్

ఏటూరునాగారం, జనవరి 10 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ స్కిల్ డెవలప్మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ హినా ఉస్మాన్ అన్నారు. లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, పీఎం జీవన జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, పీఎం స్వామి యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం జన ఆరోగ్య యోజన, పీఎం భారతీయ జన ఔషధ పరియోజన, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన తదితర పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన

కాటారం, జనవరి 10 :మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాటారం జడ్పీహెచ్ఎస్, ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు పోలీసులు సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కాటారం ఎస్సై మ్యాక అభినవ్ ఎలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా విద్యాలయాల ప్రిన్సిపాల్స్ నరేందర్, భిక్షపతి, హెచ్ఎం ఉమాదేవి, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు వేతనాలు విడుదల చేయాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 10: సమగ్రశిక్ష పరిధిలో పనిచేస్తే ఉద్యోగులైన డీఈవో కార్యాలయం, ఎమ్మార్సీ సిబ్బంది, కేజీబీవీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు, సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వేతనాలను విడుదల చేయాలని ఆయన కోరారు.

హెచ్ఐవీ నిర్మూలనపై కళా ప్రదర్శనలు


పాటల ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ములుగు కలెక్టరేట్, జనవరి 10: తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య, డ్యాప్కో సహకారంతో కళారంజని సందీప్ బృందం ఆధ్వర్యంలో కళాకారులు ములుగు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, జంగాలపల్లి అంగడి సెంటర్‌లో బుధవారం హెచ్ఐవీ/ఎయిడ్స్ నిర్మూలనపై కళా ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం కరపత్రాలు, పోస్టర్‌లను ఆవిష్కరించి పలువురికి రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్యాప్కో డీపీఎం స్వప్న మాధురి, మారి స్వచ్ఛందసంస్థ డీఆర్పీ జ్యోతి, కరుణ, మైత్రి పాజిటివ్ నెట్‌వర్క్ విహాన్, తిరుపతి, వైఆర్‌జీకే లింక్‌వర్కర్ కిషన్, రాము, కళాకారులు పోలెపాక సందీప్, కరుణాకర్, కె.శంకర్, రజిని, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేయాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 10: గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేయాలని కోరుతూ వెంకటాపురం(నూగూరు) యాదవసంఘం సభ్యులు బుధవారం జిల్లాకేంద్రంలోని పశుసంవర్ధకశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సభ్యులు, గొర్రెల పెంపకందారులు మాట్లాడుతూ ఎనిమిది నెలల క్రితం గొర్రెల పంపిణీ చేపడతామని గత ప్రభుత్వం ప్రతి సభ్యుడి నుంచి రూ.43,750ను డీడీ రూపంలో తీసుకున్నారని, ఇప్పటివరకు గొర్రెల పంపిణీ చేయకపోవడం వల్ల వడ్డీలు పెరిగి ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. వెంటనే డీడీలు చెల్లించిన ప్రతి గొల్ల,కురుమలకు గొర్రెల పంపిణీ చేపట్టి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, పెంపకందారులు వై.సాంబయ్యయాదవ్, గట్టయ్య, నరేష్, శాంతమూర్తి, వెంకటేశ్వర్లు, సమ్మక్క, తిరుపతి, శ్రీను, రాంబాబు, నర్సయ్య, లక్ష్మి, శ్రీను, శేఖర్ పాల్గొన్నారు.

ఆదివాసీలు హక్కుల కోసం పోరాడాలి : తుడుందెబ్బ

ఏటూరునాగారం, జనవరి 10 : ఆదివాసీల హక్కుల కోసం పోరాటాల తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ అన్నారు. మండల కేంద్రంలోని తుడుందెబ్బ గిరిజన భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఆదివాసీ హక్కులు, చట్టాల అమలు కోసం పాటుపడాలన్నారు. అనంతరం ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ములుగు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ములుగు జిల్లా అధ్యక్షుడుగా వట్టం జనార్దన్, జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎట్టి రాజబాబు, చింత సోమరాజు, ప్రధాన కార్యదర్శిగా చందా మహేష్, సహాయ కార్యదర్శులుగా సిద్ధబోయిన సర్వేశ్వరరావు, పెండకట్ల బాలరాజు, కోట సంపత్, సాంస్కృతిక కార్యదర్శి కోడె రవిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ కో కన్వీనర్ పొడెం రత్నం, యాసం రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణ, కాపుల సమ్మయ్య, పోలం తిరుపతి, వట్టము సురేష్, చింత సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ సిబ్బంది మెరుగైన సేవలు అందించాలి

ఏటూరునాగారం, జనవరి 10 : అంబులెన్స్‌లను సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ములుగు జిల్లా ఉప వైద్య ఆర్యోగ శాఖ అధికారి డాక్టర్ కోరం క్రాంతి కుమార్ 108 వాహనాల సిబ్బందిని సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వద్ద ఉన్న సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ద్వారా ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యవసర సమయంలో వినియోగించే పరికరాల పని తీరును, అందుబాటులో ఉన్న వివిధ రకాల మందులను అంబులెన్స్‌లలోని సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రోగ్రాం మేనేజర్ ఆర్. మహేందర్, సామాజిక ఆరోగ్య కేంద్ర ఫార్మసిస్ట్ విజయ్ కుమార్, ఈఎంటీ కిషోర్, డ్రైవర్ రాజు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

వెంకటాపురం(నూగూరు), జనవరి 10: మండలంలోని వీరభద్రవరం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గుడుంబా స్థావరాలపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. గ్రామ సమీపంలో పెద్దఎత్తున గుడుంబా తయారు చేస్తున్నారనే సమాచారంతో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బందితో దాడులు నిర్వహించామని ఎస్సై అశోక్ తెలిపారు. రెండు వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు.

ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గణేష్



టేకుమట్ల, జనవరి 10: ఎస్టీయూ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏంపేడు పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఆర్.గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాటారంలో నూతన జిల్లా కమిటీని బుధవారం ఎన్నుకున్నట్టు ఆ సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య ఓ ప్రకటనలో తెలిపారు. నూతన జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన గణేష్ తన నియమాకానికి సహకరించిన జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా రాధాకృష్ణ



మొగుళ్లపల్లి, జనవరి 10: రేషన్‌న్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని పెద్దకోమటిపల్లి గ్రామానికి చెందిన గడ్డం రాధాకృష్ణ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన సంఘం సమావేశంలో సభ్యులు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా వంగ ధనలక్ష్మి, సుధాకర్, ఉపాధ్యక్షుడిగా వీరయ్య, కోశాధికారిగా తమ్మిశెట్టి ఆగయ్య, సహాయ కార్యదర్శిగా దర్శనాల లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా మంద నరేష్, సలహాదారుడిగా నగలగాని విజయలు ఎన్నికయ్యారు. అనంతరం వారు తహసీల్దార్ సునీతను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ డీలర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన డీలర్లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

అవినీతిపై ఆరా!

(3వ పేజీ తరువాయి)

క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అయితే.. అత్యంత కీలక పత్రాలు మాత్రం లభించలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇంజనీర్లను విజిలెన్స్ అధికారులు గంటల తరబడి ప్రశ్నించారు. రికార్డుల పరిశీలనలో అనుమానాలు రావటంతో మరోసారి బుధవారం సాయంత్రం మేడిగడ్డకు చేరుకొని మరిన్ని రికార్డులతో పాటు బ్యారేజీని పరిశీలించారు. మొత్తమ్మీద విజిలెన్స్ అధికారులు రెండు రోజులుగా కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, గ్రావిటీ కెనాల్, కన్నెపల్లి పంపుహౌస్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తుండటంతో కీలకమైన సమాచారం లభించిందనే ప్రచారం జరుగుతోంది.. గురువారం కూడా విజిలెన్స్ అధికారులు మరోసారి రికార్డులను పరిశీలించి, గ్రావిటీ కెనాల్, కన్నెపల్లి పంపుహౌస్‌లను సందర్శించే అవకాశం ఉందని సమాచారం.

నిగ్గు తేల్చే పనిలో రేవంత్ సర్కారు

కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి చోటు చేసుకుందని ఆరోపిస్తూ వస్తున్న కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దాన్ని నిరూపించే పనిలో పడింది. జ్యూడిషియల్ విచారణ చేపడతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు ప్రభుత్వం లేఖ రాసింది. మేడిగడ్డ కుంగుపాటుపై విచారణ జరిపేందుకు సిట్టింగ్ జడ్జిని కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సోదాలు చేపట్టిన ప్రభుత్వం జ్యూడిషియల్ విచారణకు కూడా చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిందెవరు.. టెండర్లను ఎలా ఫైనల్ చేశారు.. మోటార్ల వాస్తవ ధర ఎంత.. చెల్లించింది ఎంత.. వాటి నాణ్యత ఏమిటి.. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టడానికి గత ప్రభుత్వం చెబుతున్న కారణాలు వాస్తవామేనా..? తదితర అంశాలపై పూర్తి సమాచారాన్ని వెలుగులోకి తెచ్చేందుకు రేవంత్ సర్కారు ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అందులో భాగంగానే విజిలెన్స్ సోదాలతో పాటు జ్యూడిషియల్ విచారణను ప్రభుత్వం చేపట్టిందని తెలుస్తోంది. మొత్తానికి కాళేశ్వరం అంశాన్ని సాగతీయకుండా త్వరలోనే నిజనిజాలను నిగ్గు తేల్చాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని సాగునీటిరంగ నిపుణులు భావిస్తున్నారు.

కాళేశ్వరంలో హుండీ లెక్కింపు


హుండీలను లెక్కిస్తున్న సేవా సమితుల సభ్యులు

మహదేవపూర్, జనవరి 10: మండలంలోని కాళేశ్వరం దేవస్థాన హుండీలను బుధవారం తెరిచారు. భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకలను లెక్కించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్ పర్యవేక్షణలో ఈవో మహేశ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 69 రోజుల్లో రూ. 23,58,715 ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు, కాళేశ్వరం ఎంపీటీసీ మమత, ధర్మకర్తలు రాంరెడ్డి, దేవేందర్, రాజయ్య, శ్యాంసుందర్, కామారెడ్డికి చెందిన 139 మంది రాజరాజేశ్వరి సేవాసమితి సభ్యులు, రాగినేడుకు చెందిన 13 మంది శ్రీ ముక్తీశ్వర సేవా సమితి సభ్యులు, హైదరాబాద్‌లోని భ్రమరాంబికా సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మానవ జీవితంలో క్రీడలు ఎంతో ముఖ్యం

ములుగు కలెక్టరేట్, జనవరి 10: క్రీడలు మానవ జీవితంలో ఎంతో ముఖ్యమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. జిల్లాకేంద్రంలోని తంగేడు స్టేడియంలో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని, దీంతో స్ఫూర్తి, తపన పెరుగుతాయని అన్నారు. క్రీడాకారులు పోటీలను మంచి అవకాశంగా భావించి రాణించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బీసీసెల్ అధ్యక్షుడు వంగ రవియాదవ్, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు రియాజ్‌మీర్జా, పార్టీ మండల అధ్యక్షుడు ఎమ్డీ.చాంద్‌పాషా, నాయకులు బాదం ప్రవీణ్, నల్లెల భరత్, ఓంప్ర తదితరులు పాల్గొన్నారు.

‘దళితబంధు’ అమలు చేయాలని ధర్నా


ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

మంగపేట, జనవరి 10: దళితబంధు పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు బుధవారం నిరసనకు దిగారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. దీనికి ముందు బస్టాండ్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో సుదర్శన్, ఎంపీవో మమతకు వినతి పత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం రెండో విడతలో లబ్ధిదారులకు రూ.26.49 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. వాటిని వారి అకౌంట్లలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి జిల్లా గౌరవ అధ్యక్షులు కర్రి శ్యాంబాబు, రాజమల్ల సుకుమార్, జిల్లా అధ్యక్షుడు బియ్యం శ్రీను, వివిధ దళిత సంఘాల నాయకులు బోడ శ్రీను, దూలగొండ సాంబశివరావు, జానపట్ల జయరాజ్, దుర్గం కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

వాజేడు, జనవరి 10: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని వాజేడు చవళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని గుమ్మడిదొడ్డిలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంను బుధవారం నిర్వహించారు. ఎస్సై ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు ఉదయాన్నే గ్రామంలోకి ప్రవేశించి ప్రతి ఇంటినీ తనిఖీ చేశారు. గ్రామంలోకి కొత్తగా వచ్చిన వ్యక్తుల వివరాలను నమోదు చేసుకున్నారు.

అనంతరం గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. అదే విధంగా బాల కార్మికులను పనిలో పెట్టుకోవద్దని అన్నారు. లేదంటే అలాంటి వ్యక్తులు, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.